ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

గురువారం 11 జూలై 2024



ఆగిపోయిన జిల్లేడుబండ రిజర్వాయర్ కట్ట నిర్మాణం



ఖరీఫ్ సాగులో రైతన్న

5 ఏళ్లుగా.. సంక్షోభంలో రైతాంగం

ప్రగతి బాట పట్టించాలి..!

కొత్త జిల్లా ఏర్పడి రెండేళ్లు గడిచినా ఎందులోనూ పురోగతి లేదు. పైగా వైసీపీ విధ్వంస పాలనలో అన్ని రంగాలు కుదేలయ్యాయి. ఉపాధి లేక పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లినవారి సంఖ్య వేలల్లో ఉంది. వ్యవసాయం, సాగునీరు, పరిశ్రమలు.. ఇలా అన్నింటిపైనా గత ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించింది. హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు చేపట్టలేదు. రిజర్వాయర్లు, చెరువులను ఎండబెట్టారు. రైతులు అప్పులపాలయ్యారు. జిల్లా కేంద్రం పుట్టపర్తిలో మౌలిక వసతులను కల్పించలేదు. ఈ సమస్యలను పరిష్కరిస్తూ.. ప్రగతి బాట పట్టించాల్సిన బాధ్యత టీడీపీ కూటమి ప్రభుత్వంపైనే ఉంది. కొత్త ప్రభుత్వంలో తొలిసారి జిల్లా అభివృద్ధి మండలి సమీక్ష సమావేశం గురువారం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన సమస్యలపై ప్రత్యేక కథనం.


- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి



జిల్లా కేంద్రం పుట్టపర్తి కప్పలబండ వద్ద పారిశ్రామిక పార్కు



గుంతలమయమైన మమ్మదాబాద్‌క్రాస్-కొక్కింటి క్రాస్ మధ్య ప్రధాన రహదారి



ముళ్ల పొదలతో నిండిన మడకశిర ఉపకాలువ



సౌకర్యాలులేక బ్రాహ్మణపల్లిలో నిలిచిపోయిన జగనన్న ఇళ్ల నిర్మాణం



జిల్లా సమగ్ర అభివృద్ధిపై నేడు సమావేశం

జిల్లా సమగ్ర అభివృద్ధిపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం మొదలవుతుందని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు.

ఆగిపోయిన సాగునీటి ప్రాజెక్టుల పనులు
కియ వద్దే ఆగిన పరిశ్రమలు.. మరిన్ని రావాలి..
రోడ్లు బాగుపడాలి.. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి
నేడు జిల్లా అభివృద్ధి మండలి సమావేశం

రైతాంగాన్ని ఆదుకోండి..

జిల్లాలో ఎక్కువశాతం వర్షాధార పంటలనే సాగు చేస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభాం కారణంగా వేరుశనగ సహా అన్ని పంటలు దెబ్బతిన్నాయి. చాలాచోట్ల పశుగ్రాసం సైతం లభించలేదు. రూ.వేల కోట్ల పెట్టుబడి మట్టిలో కలిసిపోయింది. ప్రభుత్వం నుంచి సాయం అంతంత మాత్రంగానే అందింది. గత ఖరీఫ్‌లో ఏడు మండలాలను తీవ్ర కరువు ప్రాంతాలుగా, 14 మండలాలను మధ్యస్థ కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. మిగిలిన మండలాలకు మొండిచేయిచూపారు. జిల్లాలో 1,17,005 మంది రైతులకు రూ.105.03 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. రబీలో 28,192 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. కానీ వర్షాభావం కారణంగా భూగర్భం జలమట్టం తగ్గిపోయి.. బోరు బావుల్లో నీరు ఇంకిపోయి.. ఆ పంటలూ దెబ్బతిన్నాయి. 2023-24లో రబీలో జిల్లా అతంటా కరువు అలుముకున్నా.. ఒక్క రొద్దం మండలాన్నే కరువు జాబితాలో చేర్చారు. అదికూడా పప్పు శనగ పంటకు మాత్రమే పరిహారం ప్రకటించారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు అదును దాటుతోంది. ఖరీఫ్ సాగు అంచనా 2,89,601 హెక్టార్లు కాగా.. అన్ని పంటలు కలిపి ఇప్పటి వరకూ 45,352 హెకార్టుల్లో మాత్రమే సాగయ్యాయి. అంటే.. 15.66 శాతం పొలాల్లోనే విత్తనం పడింది.

పరిశ్రమలను తీసుకురండి..

కొత్త జిల్లాకు గడిచిన ఐదేళ్లలో ఒక్క పరిశ్రమా రాలేదు. ఉద్యోగావకాలు కల్పించింది లేదు. టీడీపీ హయాంలో పెనుకొండ వద్ద కియ ఏర్పాటు కావడంతో.. జిల్లా ఆటోమొబైల్ హబ్‌గా విస్తరించింది. పెనుకొండ, పాలసముంద్రం, కప్పలబండ, హిందూపురం, మడకశిరరాళ్ల అనంతపురం, గోళ్లాపురం, గుడిపల్లి, దాదులూరు, శెట్టిపల్లి, సడ్లపల్లి, కొటిపి, కేతిగానిచెరువు, కుటాగూళ్ల వద్ద పరిశ్రమల కోసం ఎనిమిది వేల ఎకరాలకుపైగా గురించారరు. ఇందులో మూడు వేల ఎకరాలు పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉంది. పెనుకొండ, అమ్మవారుపల్లి, కప్పలబండ, కొటిపి, గోళ్లాపురం, గుడిపల్లి వద్ద ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుకు అనువైన భూమి ఉంది.

సాగునీటిపై చర్చించండి..

టీడీపీ హయాంలో 2014-19 మధ్య హంద్రీనీవా విస్తరణ పనులు చేపట్టారు. వైసీపీ హయాంలో గాలికి వదిలేశారు. జీడిపల్లి జలాశయం నుంచి ఎగువ పెన్నార్ ప్రాజెక్టు, పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి జలాశయాలకు నీటిని చేర్చేందుకు రూ.591.57 కోట్లతో చేపట్టిన పనులను పూర్తి చేయాల్సి ఉంది. చిలమత్తూరు, గోరంట్ల మండలాలకు తాగుసాగు నీరు ఇవ్వాల్సి ఉంది. 160 చెరువులకు నీరిచ్చే రూ.510 కోట్ల ఎత్తిపోతల డీపీఆర్‌కు సాంకేతిక అనుమతులు తీసుకురవాల్సి ఉంది. మడకశిర నియోజకవర్గంలో రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్లను నిర్మించాల్సి ఉంది. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర ఉప కాలువ గట్టుకు ఇరువైపులా లైనింగ్ వేయాల్సి ఉంది. రాప్తాడు నియోజకవర్గానికి సాగు నీరు అందించే జీడీపల్లి- పేరూరు, ముట్టాల, తోపుదుర్తి, దేవకొండ వద్ద మూడు జలాశయాల నిర్మాణానికి నిధులు రాబట్టాలి.

మౌలిక వసతులు..

పుట్టపర్తి కేంద్రంగా 2022 ఏప్రిల్ 4న శ్రీసత్యసాయి జిల్లా ఏర్పడింది. ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు పక్కాభవనాలు లేవు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు మినహా మిగిలిన వాటిలో కనీస వసతులు లేవు. దీంతో అధికారులు, సిబ్బంది నామమాత్రంగా విధులకు హాజరౌతున్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు భవనాల్లోనే పాలన సాగుతోంది. మౌలిక వసతుల కల్పన దిశగా చర్యలు చేపట్టాలి.

అధ్వానంగా రోడ్లు..

ప్రగతి సూచీలుగా భావించే రహదారులు జిల్లాలో అధ్వానంగా ఉన్నాయి. గడిచిన ఐదేళ్ల నిధులు విడుదల చేయకపోవడంతో జనం గతుకుల రోడ్లపై ప్రయాణం సాగిస్తున్నారు. ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారులపైనా గజానికో గొయ్యి కనిపిస్తున్నాయి. రోడెక్కాలంటే జనం భయపడే పరిస్థితి ఉంది. 2020-22 నడుమ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న రహదారులను తూతూ మంత్రంగా మరమ్మతు చేశారు. చాలా చోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయి. కంకర వేసి వదిలేసిన రోడ్లు చాలానే ఉన్నాయి. అత్యవసరంగా రహదారులను బాగు చేయించాలి.

- పక్కా ఇళ్ల నిర్మాణం ఎక్కడికక్కడ ఆగిపోయింది. జగనన్న కాలనీల పేరిట ప్రజాధనం వృథా చేశారు.

ప్రబలుతున్న రోగాలు..

స్థానిక సంస్థలలో నిధుల కొరత కారణంగా పల్లెలు, పట్టణాలలో అపరిశుభ్రత తాండవిస్తోంది. దోమలు ప్రబలుతున్నాయి. డెంగీ, మలేరియా, అతిసార కేసులు భారీగా నమోదవుతున్నాయి. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

పేదలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు

కొత్త కలెక్టర్ టీఎస్ చేతన్



కలెక్టరుగా బాధ్యతలు స్వీకరిస్తున్న టీఎస్ చేతన్ , స్వాగతం పలుకుతున్న జేసీ, ఎస్పీ

పుట్టపర్తి, జూలై 9: పేదలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని కలెక్టరు టీఎస్ చేతన్ అన్నారు. పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి కలెక్టరు, జేసీ అభిషేక్ కుమార్, ఎస్పీ మాధవరెడ్డి, పెనుకొండ సబ్ కలెక్టరు అపూర్వ భరత్, డీఆర్ఓ కొండయ్య తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజలు కలసి పనిచేద్దామని అన్నారు. ఇసుక ఉచితంగా అందిస్తామని, త్వరలో అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామని తెలిపారు.

రాష్ట్ర జట్టుకు జిల్లా క్రీడాకారులు



రాష్ట్ర జట్టుకు ఎంపికైన సత్యసాయి జిల్లా జట్టు

ధర్మవరం, జూలై 10: హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 17 వరకు పులివెందులలో జరిగే దక్షిణాది రాష్ట్రాల జూనియర్ బాలుర, బాలికల హాకీ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు పలువురు జిల్లా క్రీడాకారులు ఎంపియ్యారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు మహబూబ్‌బాషా, పవిత్ర, సింధు, నసీమా రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు బందనాధం సూర్యప్రకాశ్ తెలిపారు. క్రీడాకారులను హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ అరవింద్ గౌడ్, కోచ్ హుస్సేన్‌తో కలిసి ఆయన అభినందించారు.

ధర్మవరం-చెన్నై బస్సు సర్వీసు ప్రారంభం

పూజలు నిర్వహించిన మంత్రి సత్యకుమార్



ధర్మవరం-చెన్నై నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్.. మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు



ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేబీ నాగార్జునరెడ్డి, రీజనల్ జాయింట్ సెక్రటరీ నరసింహులు, డిపో కార్యదర్శి ముస్తాఫా, ఏడీసీ మేడాపురం నరసింహులు, మునయ్య పాల్గొన్నారు.

ధర్మవరం, జూలై 10: ధర్మవరం-చెన్నై బస్సు సర్వీసును మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ బస్సు ధర్మవరం పుట్టపర్తి, కదిరి, మదనపల్లి, తిరుపతి మీదుగా నుంచి చెన్నైకి వెళుతుందని ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్ మంత్రికి వివరించారు. ఈ సర్వీసు వల్ల వ్యాపారులు, కార్గో సర్వీసులవారికి ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకునేలా లింకును ఈ బస్సు ద్వారా ఆర్టీసీ కల్పించిందని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, డీఎం సత్యనారాయణరావు, జనసేన రాష్ట్ర ప్రధాకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె వెలుగులను పునరుద్ధరించండి


రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నందున.. పల్లె వెలుగు బస్సులను పునరుద్ధరించాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు విన్నవించారు. తతంలో క్రిష్టాపురం, రామగిరి, న్యామద్దల, సీకేపల్లి, సింహాద్రిపురం, కల్యాణదుర్గం, సిద్ధరాంపురం గ్రామాలకు పల్లెవెలుగు బస్సులు నడిచేవని తెలిపారు. వీటితోపాటు విజయవాడ సూపర్ లగ్జరీ బస్సును పునరుద్ధరించాలని వినతి పత్రం సమర్పించారు. ఆర్టీసీ ఉద్యోగులకు నెలకొకసారి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని, బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతపురం వైపు వెళ్లే రహదారిలో ప్రయాణికులను ఎక్కించుకునేందుకు అడ్డుగా ఉన్న ఆటోలపై పోలీసుల ద్వారా చర్యలు తీసుకోవాలని కోరారు.

అవార్డులకు దరఖాస్తు చేసుకోండి: డీఈఓ


కొత్తచెరువు, జూలై 10: జిల్లాలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు 2024 జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 15లోగా దరఖాస్తులను nationalawardstoteacher. education.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు కనీసం 10 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసి ఉండాలని అన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ వారి దరఖాస్తులను ధ్రువీకరణ అధికారి ద్వారా ఆమోదింపచేసుకుని, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

సైన్స్ ప్రాజెక్టులకు నామినేషన్లు పంపండి

జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రపాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు ఈ నెల 15లోగా సైన్స్ ప్రాజెక్టుల నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని డీఈఓ మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్లను ఆన్‌లైన్‌లో పంపాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, కస్తూర్బా, సొసైటీ యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థుల నుంచి కొత్త, నాణ్యమైన నమూనాలను తయారు చేయించాలని సూచించారు. ప్రతి పాఠశాల నుంచి ఒక్కొక్కటి చొప్పున ఐదు నమూనాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకోసం జిల్లా సైన్స్ అధికారి వెంకటరమణను 9550818817 సెల్ నంబరులో సంప్రదించాలని సూచించారు.



రైతులపై సోలార్ పవర్..!



భూముల్లో ఏర్పాటు చేసిన సోలార్ ప్లేట్లు

నివేదికలు పంపాం..

సోలార్ ప్రాజెక్టు కోసం భూములను ఇచ్చిన రైతుల జాబితాను పరిశీలించాము. ఫిర్యాదు చేసిన రైతుల రికార్డులు పరిశీలించాం. పరిహారం అందని రైతుల వివరాలతో నివేదికలను తయారు చేసి ఉన్నాతాధికారులకు పంపాము.

- నరేంద్రకుమార్, తహసీల్దారు, ఎన్పీకుంట

పరిహారం ఇవ్వలేదు..

నా పేరిట 92 సెంట్ల డి-పట్టా భూమి ఉంది. నా భూమిలో సోలార్ ప్లేట్లు బిగించారు. పరిహారం ఇవ్వలేదు. కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి పలుమార్లు ఫిర్యాదు చేశాం. మా సమస్య పరిష్కారం కాలేదు. పోలీసులను అడ్డుపెట్టుకుని మా భూముల్లో అప్పట్లో దౌర్జన్యంగా పనులుచేశారు. పరిహారం ఇస్తామని చెప్పి అధికారులు మాట నిలుపుకోలేదు. పరిహారం వస్తే నాయకు వృద్ధాప్యంలో ఆసరగా ఉంటుంది.



- పద్మావత్మ, పి.గొల్లపల్లి

నంబులపూల కుంట, జూలై 10: సోలార్ అల్ట్రా పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు భూములు ఇచ్చిన రైతులు పరిహారం కోసం ఏళ్ల తరబడి ఎదురు చుస్తున్నారు. నంబులపూలకుంట, పి.కొత్తపల్లి రెవెన్యూ గ్రామాల రైతుల భూములతోపాటు వాగులు, వంకలు, ప్రభుత్వ భూములు.. మొత్తం 6,300 ఎకరాలను ప్రాజెక్టు కోసం సేకరించారు. ఇందులో వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. పరిహారం విషయంలో కొందరికి విడతలవారీగా చెల్లింపులు జరిగాయి. మరికొందరికి పైసా కూడా ఇవ్వలేదు. డి-పట్టాలున్న పి.కొత్తపల్లి రైతులకు ఎకరానికి రూ.2 లక్షలు, ఎన్‌పీ కుంట రైతులకు రూ.2.10 లక్షల ప్రకారం పరిహారం ఇచ్చారు. పూర్వికుల పట్టాలు ఉన్న పి.కొత్తపల్లి రైతులకు ఎకరానికి రూ.3 లక్షలు, ఎన్పీ కుంట రైతులకు రూ.3.10 లక్షలు ప్రకారం పరిహారం అందించారు. సాగులో ఉంటూ, పట్టాలకు నోచుకోని రైతులకు ఎకరానికి కేవలం రూ.లక్ష ఇచ్చారు. ఈ పరిహారం విడతల వారీగా పంపిణీ చేయడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. చిన్న చిన్న సమస్యల కారణంగా వందలాది మంది రైతులకు పరిహారం చెల్లించలేదు. గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినా, క్లియరెన్స్ అయినా డి-పట్టాలు ఉన్న 43 మంది రైతులు పరిహారానికి నోచుకోలేదు. సాగులో ఉన్న రైతులను 1,196 మందిని గుర్తించారు. వీరిలో 222 మంది ఇతర ప్రాంతాలలో ఉన్నారన్న కారణంగా పరిహారం పెడింగ్‌లో పెట్టారు.

పోలీసు బందోబస్తుతో..

డి-పట్టా ఉన్నా పరిహారం ఇవ్వకపోవడంతో బాధిత రైతులు తమ పొలాలలో సోలార్ ప్రాజెక్టు పనులను చేయనివ్వలేదు. ఏళ్ల తరబడి కాపాల కాశారు. తమ భూముల్లో రాత్రికి రాత్రి యంత్రాలతో పనులు చేస్తారేమోనన్న భయంతో సద్ది కట్టుకుని మరీ రేయింబవళ్లల పొలాల్లో కాపలా ఉండిపోయారు. దీంతో పోలీసులను రంగంలోకి దింపి రైతుల పొలాల్లో పనులను పూర్తి చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఇలా.. రైతులపై బలప్రయోగం చేసి.. 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి పనులను ప్రారంభించారు. రైతుల పక్షాల అప్పట్లో టీడీపీ, బీజేపీ, సీపీఐ, సీపీఎం నాయకులు పోరాడారు. కానీ ఫలితం లేకపోయింది. ఒక డీఎస్పీ, ఒక సీఐ, నలుగులు ఎస్ఐలు, భారీగా పోలీస్ సిబ్బంది మోహరించి.. యంత్రాలను పొలాల్లోకి తీసుకువెళ్లారు. రైతుల భూముల్లో పనులు చేశారు. పొలాల్లోకి రైతులు వెళ్లకుండా కంచె ఏర్పాటు చేశారు.

దౌర్జన్యంగా లాక్కున్నారు..

సోలార్ ప్రాజెక్టు కోసం ఐదు ఎకరాల డి- పట్టా భూమిని బలవంతంగా తీసుకు న్నారు. భూమి నా పేరిట ఉంది. పనులు చేయకుండా కొన్ని నెలల పాటు పొలంవద్ద కాపాల కాచాను. చావడానికి కూడా వెనకాడకుండా యంత్రాల కింద పడుకున్నాను. పోలీసులు, రెవెన్యూ అధికారుల మాటలు విని మోసపోయాను. మా భూముల్లో సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేశారు. సరిహద్దులు, చెట్ల గుర్తులు చెరిపేశారు. లోపలికి వెళ్లకుండా కంచె వేశారు. భూమిని లాగేసుకున్నారు గాని.. పరిహారం మాత్రం ఇవ్వలేదు.

- వెంకటలక్ష్మమ్మ, దిగువ తూపల్లి

పరిహారం కోసం..

సోలార్ అల్ట్రా పవర్ ప్రాజెక్టు కారణంగా భూములు కోల్పోయిన రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. డి-పట్టాలు ఉన్న 43 మంది రైతులు నేటికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాలకు వెళ్లి.. అధికారులకు విన్నవిస్తున్నారు. అర్హత ఉన్నా పరిహారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్లపాటు తమ గోడు ఎవరూ పట్టించుకోలేదని, టీడీపీ కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

ఎవరినీ వదలొద్దు: ఎస్పీ

రాయదుర్గం, జూలై 10: మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన ఆదికేశవులు హత్య కేసులో నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీ గౌతమిశాలి ఆదేశించారు. హత్య జరిగిన స్థలాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. కేసు దర్యాప్తులో పురోగతి సాధించేందుకు తగు సూచనలు చేశారు. హత్య జరిగిన విధానం, అనుమానితుల గురించి ఆరా తీశారు. ఎవరినీ వదలకుండా దర్యాప్తు వేగంగా పూర్తి చేయాలన్నారు.

నిందితులను పట్టుకుంటాం: డీఎస్పీ



రాయదుర్గం రూరల్: మండలంలోని మెచ్చిరి గ్రామంలో మంగళవారం రాత్రి టీడీపీ నాయకుడు ఆదికేశవులును హత్య చేసిన నిందితులను పట్టుకుంటామని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. హత్యకు సంబంధించి నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను దింపి సాక్ష్యాలను సేకరించామన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

రోడ్డుపై మృతుడి బంధువుల బైఠాయింపు



ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహిస్తున్న మృతుడి బంధువులు

ఆదికేశవులును హత్యచేసిన నిందితులను త్వరగా పట్టుకుని, శిక్షించాలని కుటుంబసభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. బుధవారం ఆసుపత్రి వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమ తండ్రి ఏ పాపం చేశాడని అతి కిరాతకంగా హత్య చేశారని ఆదికేశవులు కూతురు అక్షయ, కొడుకు కార్తీక్ ప్రశ్నించారు. నిందితులను అదుపులోకి తీసుకొని కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. టీడీపీ మండల కన్వీనర్‌లు హనుమంతు, హనుమంతరెడ్డిలు డీఎస్పీతో చర్చించారు. డీఎస్పీ నిరసనకారులను నచ్చజెప్పి ఆందోళన విరమింప చేయించారు.

ఆధిపత్యం కోసమే హత్య

వరుస సంఘటనలతో బలపడిన ఆదికేశవులు నాయకత్వం

వైసీపీ నాయకులే సూత్రధారులని అనుమానం

రాయదుర్గం, జూలై 10: తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉండే ఆదికేశవులును హతమారిస్తే గ్రామంలో తమ ఆధిపత్యానికి తిరుగు ఉండదనే భావనతోనే హత్య చేసినట్లు తెలుస్తోంది. రెండేళ్లుగా మెచ్చిరి గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. రెండు వర్గాలు రెండు ప్రధాన పార్టీల్లో చేరి ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడటం జరుగుతుండేది. పైగా మెచ్చిరి గ్రామంలో ఎప్పుడూ వైసీపీకి ఆధిక్యం వచ్చేది. కానీ ఈ సారి జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మెజార్టీ రావడం లాంటివన్నీ ఆదికేశవులు హత్యకు మూలాలుగా అనుమానిస్తున్నారు. దీంతో పాటు గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులకు సంబంధించిన వివాదంలో కూడా ఒక వర్గం అర్చకుల వెంట ఉండి పైచేయి సాధించింది. దీనంతటికీ ఆదికేశవులే కారణమని, తమ ఆధిపత్యానికి అడ్డుగా ఉన్న ఆయన్ను హతమార్చడమే ప్రత్యర్థులు ఏకైక లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

ఆదికేశవులు నాయకత్వాన్ని జీర్ణించుకోలేకే..

గ్రామంలో రెండు వర్గాల మధ్య ఉన్న అధిపత్యపోరులో ఒక వర్గానికి ఆదికేశవులు నాయకుడుగా ఉన్నారు. మరో వర్గానికి సర్పంచ్ చంద్రతో పాటు కృష్ణారెడ్డి నాయకత్వం వహిస్తున్నారు. రెండేళ్ల కిందట ఇరువర్గాల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ జరిగింది. ఇళ్లల్లో చొరబడి దాడులు సైతం చేసుకున్నారు. వైసీపీ అధికారంలో ఉండటంతో తెలుగుదేశం పార్టీకి చెందిన ఆదికేశవులుతో పాటు మరో కొంతమందిపై హత్యాయత్నం కేసులు కూడా నమోదయ్యాయి. అర్చకులకు సంబంధించిన వివాదంలో కూడా కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ అర్చకులకు ఆలయంలోకి ప్రవేశం కల్పించాలని ఆదేశించినా వైసీపీ అధికారంలో ఉన్నంత వరకు వారికి అనుమతించకుండా అడ్డుకోవడంలో వైసీపీ నాయకులు సఫలీకృతులయ్యారు. ఇలాంటి వివాదాలన్నీ ఒక్కొక్కటిగా ఆదికేశవులు నాయకత్వాన్ని బలపరుస్తూ వచ్చాయి. ఈక్రమంలోనే ఇటీవల తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, ఎప్పుడూ లేని మెజార్టీ సైతం గ్రామంలో టీడీపీకి దక్కింది. దీంతో ఆదికేశవులు నాయకత్వానికి మరింత బలం చేకూరింది. దీనిని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు ఆదికేశవులును అడ్డుతొలగించుకోవాలనే సంకల్పానికి వచ్చినట్లు కనిపిస్తోంది. ఇందుకు గ్రామం వదిలి వెళ్లిపోయిన కేశవరెడ్డిని రంగంలోకి దింపినట్లు సమాచారం.

కేశవరెడ్డిపైనే అనుమానాలన్నీ..

మెచ్చిరి గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి కొడుకు కేశవరెడ్డిపైనే పోలీసులకు అనుమానం కలుగుతోంది. తండ్రినే హతమార్చేందుకు యత్నించిన చరిత్ర కేశవరెడ్డిది. ఆస్తి వివాదంలో తండ్రినే హతమార్చేందుకు ప్రయత్నించడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అప్పటి నుంచి కుటుంబానికి దూరంగా కర్ణాటకలో ఉంటున్నాడు. అక్కడ జరిగిన హత్యలో కూడా కేశవరెడ్డి పాల్గొన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామంలో ఉన్న కొందరు వైసీపీ నాయకులు కేశవరెడ్డిని ఆశ్రయించి తమ సామాజిక వర్గ ఆధిపత్యానికి అడ్డుగా ఉన్న ఆదికేశవులును హతమార్చేందుకు ఒప్పించినట్లు గ్రామంలో చర్చించుకుంటున్నారు. దీనికి అంగీకరించిన కేశవరెడ్డి తనతో పాటు నేర చరిత్ర కలిగిన మరో ఐదుగురిని సిద్ధం చేసుకుని గ్రామంలో వారంరోజుల పాటు మకాం వేసినట్లు తెలుస్తోంది. గ్రామ సరిహద్దులో ఉన్న తోటల్లో ఉంటూ ఆదికేశవులు కదలికలపై నిఘా ఉంచినట్లు సమాచారం. మంగళవారం రాత్రి ఒంటరిగా ప్రయాణిస్తున్న ఆదికేశవులును వెంబడించి హతమార్చినట్లు చర్చ జరుగుతోంది. వారంరోజుల పాటు గ్రామస్థులకు కనిపించిన కేశవరెడ్డి హత్య తర్వాత కనిపించడం లేదు. దీంతో అతడిపై గ్రామస్థులు బలంగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

యువతి అదృశ్యం



రంగమ్మ (ఫైల్)

తాడిపత్రి, జూలై 10: పెద్దపప్పూరు మండలంలోని జూటూరుకు చెందిన రంగమ్మ అనే యువతి రెండురోజుల నుంచి కనిపించడం లేద ని బుధవారం ఫిర్యాదు అందినట్లు పెద్దపప్పూరు పోలీసులు తెలిపారు. తన కుమార్తె రంగమ్మ ఈనెల 9వ తేదీన ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని ఆమె తండ్రి జూటూరుకు చెందిన నారా యణ రెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రంగమ్మకు మతిస్థిమితం కూడా సరిగా లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ ఫోన్ నంబర్ 9848113255 కు తెలయజేయాలని పోలీసులు కోరారు.

ప్రాణాలు తీసిన పల్లె గొడవలు

- చిన్నారిని నీటితొట్టెలో వేసి.. తల్లి ఆత్మహత్య
- అనంతపురం జిల్లాలో విషాద ఘటన



భర్త శాంతకుమార్‌తో మమత, కూతురు(ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, జూలై 10: మండల పరిధిలోని మల్లికార్జునపల్లిలో బుధవారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఎనిమిది నెలల కూతురిని నీటి తొట్టెలో వేసి.. మమత(24) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన మేరకు, మల్లికార్జునపల్లిలో నాలుగు రోజుల క్రితం రెండు వర్గాల మధ్య గ్రామ రాజకీయాల నేపథ్యంలో గొడవలు జరిగాయి. ఆ సమయంలో కులం పేరుతో దూషించినందుకు శాంతకుమార్ అనే వ్యక్తిపై వైరి వర్గంవారు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో తన భర్తపై కేసు పెడితే తన భవిష్యత్తు ఏమౌతుందోనని శాంతకుమార్ భార్య మమత ఆందోళనకు గురైంది. ఈ నేపథ్యంలో తన ఎనిమిది నెలలు కూతురుని బుధవారం బాత్రూమ్‌లో ఉన్న నీటి తొట్టెలో పడేసి, తాను అక్కడే ఉరి వేసుకుంది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు బాత్రూమ్ తలుపులు బద్దలుకొట్టి చూశారు. అప్పటికే ఇద్దరూ మృతిచెందారు. కళ్యాణదుర్గం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేరుశనగకు తెగుళ్లు

పైరును ఆశించిన ఆకుముడుత, పచ్చపురుగు

ఆందోళనలో రైతులు



వేరుశనగ పంటకు ట్రాక్టరుతో మందు పిచికారి చేస్తున రైతు



పంటను ఆశించిన పచ్చపురుగు

గుత్తి రూరల్, జూలై 10: రైతులు పంటలను సాగు చేస్తున్నారో లేదో అప్పుడే ఆ పంటలకు తెగుళ్లు సోకుతున్నాయి. వేరుశనగ పంటను ఆకుముడుత పురుగు ఆశించింది. పసి దశలో ఉన్న పైరును చుట్టిముట్టేస్తున్నాయి. దీనికి తడు పచ్చపురుగుసైతం ఆశిచింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలవ్యాప్తంగా 9,800 హెక్టార్లలో పంట సాగు చేయాల్సి ఉంది. అయితే 1495 హెక్టార్లలో మాత్ర మే సాగు చేశారు. వేరుశనగ, పత్తి, ఆముదం, కంది పంటలను రైతులు సాగు చేశారు. మండలంలోని గొందిపల్లి, జక్కలచెరువు, గాజులపల్లి, తొండపాడు, టీ. కొత్తపల్లి, కొత్తపేట, వన్నేదొడ్డి, ఎంగిలిబండ, ఇసురాళ్లపల్లి, కరిడికొండ, ఊబిచేర్ల, ఈశ్వరపల్లి, తదితర గ్రామాల్లో వేరుశనగ పంటలు సాగు చేశారు. వాతావరణ మార్పులో కారణంగా వేరుశనగ పంటను తెగుళ్లు చుట్టుముట్టాయి.

ఆకుముడత వ్యాపించింది..



రెండు ఎకరాలో జూన్ 18న వేరుశనగ పంట సాగు చేశాను. ఆకుముడత తెలుగు పంటకు సోకింది. మందు పిచికారి చేసినా ఫలితం లేదు. వాతావరణ మార్పులతో పంటలో ఎదుగుదల లేదు.

- నాగేంద్ర, రైతు, కొత్తపేట

పచ్చపురుగు ఆశించింది..



ఐదు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. 23 రోజుల పైరును పచ్చపురుగు అశించింది. పురుగుల మందు పిచ్చికారి చేశాను. మరోసారి కొనడానికి డబ్బులు లేవు. ప్రభుత్వం పురుగు మందులను సబ్సిడీతో అందించాలి.

- నాగేష్, రైతు, జక్కలచెరువు

మందులను పిచికారి చేయాలి

తెగుళ్ల నివారణకు చర్యలను రైతులు తీసుకోవాలి. ఆకుముడత తెగులు ఆశించి ఉంటే ఎకరానికి 500 ఎంఎల్ క్లోరోఫైరిపాస్, 300 గ్రాములు అస్ఫేట్ పొడి మందును పిచికారి చేయాలి. పచ్చపురుగు నివారణకు ఎకరానికి ఎమామెక్టిన్ బెంజోయేట్ 100గ్రాములు చొప్పున స్ప్రే చేయాలి. పురుగు ఉధృతను బట్టి వారం రోజుల వ్యవధిలో మరోసారి పిచికారి చేయాల్సి ఉంటుంది.

- ముస్తాక్ అహమ్మద్, వ్యవసాయాధికారి, గుత్తి

అభివృద్ధి పథంలో నడిపిస్తాం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

అనంతపురం అర్బన్, జూలై 10: ప్రజాప్రతినిధుల సహకారంతో ఉమ్మడి జిల్లాను అభివృద్ధి బాటలో నడిపిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణి శ్రీ, ఎంఎస్ రాజుతో కలిసి బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిని భారీ మెజార్టీతో గెలిపించడంతోపాటు ఉమ్మడి అనంత జిల్లాలో 14 ఎమ్మెల్యే, రెండు ఎంపీ సీట్లు గెలిపించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో టీడీపీ హయాంలో చేసిన అభివృద్దే రాష్ట్రంలో కనిపిస్తోందన్నారు. వైసీపీ హయాంలో దోచుకోవడం, దాచుకోవడంపైనే దృష్టి పెట్టారన్నారు. ఇసుక, ల్యాండ్, మైనింగ్ మాఫియాతో రాష్ట్రాన్ని లూటీ చేశారన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమైందన్నారు. ప్రజలు ఏ నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారో ఆ నమ్మకాన్ని ఎన్డీఏ కూటమి నిలబెట్టుకుంటుందన్నారు. అనంత జిల్లాలో సాగునీటి ప్రాజెక్టు పనులు చేపట్టడంతోపాటు పరిశ్రమలు తీసుకొస్తామన్నారు. అనంతను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చొరవ చూపుతామన్నారు.

అనంత అంటే చంద్రబాబుకు ప్రేమ

కరువు జిల్లా అనంతపై చంద్రబాబుకు ప్రేమ ఎక్కువని, అందుకే ఈ జిల్లాకు కృష్ణా జలాలు తీసుకొచ్చి అపర భగీరథుడిగా నిలిచారన్నారు. హాస్టళ్లలో డైట్ బిల్లులు ఇవ్వలేని దుస్థితిలో గత ఐదేళ్ల పాలన సాగిందన్నారు. బడుగు, బలహీన వర్గాలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. చేనేతను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. ప్రతి సోమవారం అందరూ చేనేత వస్త్రాలు ధరించి ప్రోత్సహించాలని కోరారు. ఐదేళ్లల్లో ఇసుక కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ఇసుకతోనే రాష్ట్రాన్ని మాజీ సీఎం జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు దోచుకున్నారన్నారు. సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చారని, సామాన్య ప్రజలకు నాణ్యమైన ఇసుకను అందించేందుకు రీచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు అడుగు జాడల్లో నడుస్తూ అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తామన్నారు. ఎన్నికల హామీల అమలులో భాగంగా సీఎం చంద్రబాబు తొలి సంతకం మెగా డీఎస్సీపై పెట్టి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చొరవ చూపారన్నారు. గత ప్రభుత్వం హయాంలో అస్తవ్యస్తంగా మారిన పాలనను గాడిలో పెట్టేందుకు చంద్రబాబు శ్రమిస్తున్నారన్నారు. జిల్లాలో బీసీ, ఎస్సీఎస్టీ, మైనార్టీ స్కూళ్లలో సీట్ల కొరత ఎక్కువ ఉందని, సీట్లు పెంచి ఎక్కువ మంది విద్యార్థులకు అవకాశం కల్పించేలా చూడాలని మంత్రి సవితను కోరారు. జిల్లాలో హార్టికల్చర్ ఎయిర్ పోర్టు ఏర్పాటు చేస్తే పండిన పంటలను న్యూఢిల్లీ, కోల్‌కతా వంటి నగరాలకు, ఇతర దేశాలకు పంపేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంత నగరంలో అండర్ డ్రైనేజీ కోసం నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు వెల్లడించారు. అనంతను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో జిల్లా సమస్యలను ప్రస్తావించి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తానన్నారు.

స్పెషల్ కౌంటర్లలో సోనామసూరి, కందిపప్పు అమ్మకాలు

జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్

అనంతపురం టౌన్, జూలై 10: స్థానిక రైతుబజార్‌లోని ప్రత్యేక కౌంటర్లలో సోనామసూరి, కందిపప్పు అమ్మకాలు చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కందిపప్పు కిలోరూ160లు, బీపీటీ సోనామసూరి ఫైన్‌రైస్(స్టీమ్) కిలో49, బీపీటీ సోనామసూరి ఫైన్‌రైస్(ముడి) కిలో రూ48 చొప్పున ధరలను నిర్ణయించడం జరిగిందన్నారు. అదేవిధంగా జిల్లాకేంద్రంలోని డీమార్ట్, రిలయన్స్‌మార్ట్, విశాల్‌మెగా మార్ట్, మోర్‌మార్ట్‌లలో కూడా నిర్ణయించిన ధరలకే కందిపప్పు, బియ్యం అమ్మకాలు చేయడం జరుగుతుందన్నారు.

టమోటా కిలో రూ.45

అనంతపురం రూరల్, జూలై 10: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.45తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం 90టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.38, కనిష్ఠ ధర రూ.32 పలికినట్లు ఆయన తెలిపారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే

- స్కీం వర్కర్లపై వేధింపులు ఆపాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



ధర్నాలో మాట్లాడుతున్న ఓబులు

అనంతపురం కల్చరల్, జూలై 10: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. సీఐటీయూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం కార్మికుల డిమాండ్స్‌డేగా పాటిస్తూ సప్తగిరి సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ సంయుక్త అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఓబులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మికులు, కర్షకుల శ్రమను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేలా లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ఎంతోమంది కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని, ఇది కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే లేబర్‌కోడ్‌లను ఉపసంహరించి, 44 చట్టాలను పునరుద్ధరించాలన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కొందరు స్థానిక నాయకులు చిరుద్యోగులు, స్కీం వర్కర్లపై దాడులు, వేధింపులు, తొలగింపులకు పాల్పడడం తగదన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గోపాల్, నగర కార్యదర్శులు ముర్తుజా, వెంకటనారాయణ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శకుంతల, రమాదేవి, మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల యూనియన్, గ్రామపంచాయతీ ఉద్యోగులు కార్మికుల యూనియన్, మెడికల్ రెప్స్ యూనియన్, శ్రీరామిరెడ్డి, సత్యసాయి వాటర్ వర్క్స్ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన భర్త



మృత్యురాలు సువర్ణ

గార్లదిన్నె, జూలై 10: మండలంలోని ఇల్లూరులో కుటుంబ కలహాలతో భార్యను భర్త బుధవారం హత్య చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... ప్యాపిలికి చెందిన బోయ ఓబులేసు కుమార్తె సువర్ణ (27)ను పదేళ్ల కిందట ఇల్లూరు గ్రామానికి చెందిన ఎర్రిస్వామికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎర్రిస్వామి బొలెరో వాహనం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఎర్రిస్వామి మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతో భార్య సువర్ణ కొన్ని రోజుల నుంచి భర్తతో గొడవ పడుతోంది. ఈక్రమంలోనే మంగళవారం రాత్రి కూడా గొడవపడ్డారు. గొడవలో కోపోద్రిక్తుడైన ఎర్రిస్వామి భార్య సువర్ణను చితకబాది చంపేశాడు. అనంతరం ఇంట్లోనే ఉరివేసి ఆత్మహత్యగా చిత్రకరించాడు. సమాచారం అందుకున్న సీఐ శ్రీధర్, ఎస్ఐ గౌస్‌బాషా బుధవారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకుని జరిగిన విషయంపై ఆరా తీశారు. మృతురాలి పుట్టింటి వారు ఇల్లూరుకు చేరుకుని తమ కుమార్తెను ఎర్రిస్వామే హత్య చేశాడని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు భర్త ఎర్రిస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. విచారణలో తానే తన భార్యను హత్య చేసినట్లు నిందితుడు ఎర్రిస్వామి ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 10 : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.30వేలు విలువచేసే 2కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ బాజీజాన్‌సైద వివరాలను వెల్లడించారు. మండల కేంద్రంలోని నక్కలగుట్ట కాలనీవద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసు ల విచారణలో వారు గంజాయి అమ్మకానికి వచ్చినట్లు తెలిసింది. ఒడిశా రాష్ట్రం బాలంగీర్ జిల్లాకు చెందిన బలరాంబాగ్, పింటునాయక్ పుల్వామాకు చెందిన రాహుల్ నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలుచేసి వాటిని చిన్నప్యాకెట్లుగా మార్చి అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు అందించిన సమాచారం మేరకు వారిని అరెస్టు చేసి వారి నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. వారిని పెనుకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ముందుకు హాజరుపరిచాం. మరికొందరు కూడా గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంది. వారిని త్వరలోనే అరెస్టు చేస్తాం. సమావేశంలో సీఐ యుగంధర్, ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన గడ్డం సుబ్రహ్మణ్యం



సీఎం చంద్రబాబునాయుడును కలిసిన గడ్డం సుబ్రహ్మణ్యం, ఆయన కుమారుడు లలిత్‌కృష్ణ

అనంతపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రహ్మణ్యం, ఆయన కుమారుడు ఎద్దులపల్లి లలిత్‌కృష్ణ కలిశారు. బుధవారం మంగళగిరిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో వారు చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి అధికారంలోకి రావడంతోపాటు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో వారు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే సందర్భంలో త్వరలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పోస్టుల్లో తగిన గుర్తింపునివ్వాలని చంద్రబాబును కోరారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో లలిత్‌కృష్ణ తాజా రాజకీయాలపై చర్చించినట్లు సమాచారం.

నారా లోకేశ్‌ను కలిసిన ఎంపీ బీకే పార్థసారథి



పెనుకొండ, జూలై 10: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీశాఖ మంత్రి నారాలోకేష్‌ను హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బుధవారం బీకే పార్థసారథి భేటీ అయ్యారు. ఆయనతో పాటు రొద్దం మండల టీడీపీ నాయకులు నరసింహులు ఉన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

హిందూపురం, జూలై 10 : హిందూపురం మండలం దేవరపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ బాలాజీ నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు బుధవారం మధ్యాహ్నం సమయంలో సుమారు 35నుంచి 40ఏళ్ల వయసు గల వ్యక్తి దేవరపల్లి సమీపంలో రైలుకిందపడి మృతిచెందాడు. మృతుడు 5.5అడుగుల ఎత్తు ఉన్నాడు. అతని వద్ద కర్ణాటక ఆర్టీసీబస్సులో ప్రయాణం చేసిన బస్సుటికెట్ ఉందన్నారు. ఆ టికెట్ మంగళవారం ప్రయాణించిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎవరైనా గుర్తిస్తే హిందూపురం రైల్వే పోలీసులు 9441238182 నందు సంప్రదించాలన్నారు.

మహాప్రభో..! జీతాలు ఇవ్వండి

శాప్ కార్యాలయం ఎదుట కోచ్‌ల ధర్నా



ధర్నా చేస్తున్న కోచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 10: 'గత ఆరునెలలుగా వేతనాలు లేవు. మా కుటుంబాలు ఏమితినాలి? ఎలా బతకాలి?' అంటూ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడలోని శాప్ కార్యాలయం ఎదుట క్రీడాకోచ్‌లు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శాప్ కోచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ 2017లో శాప్‌లో కోచ్‌లుగా చేరామని, అయితే ఇప్పటి వరకు తమకు జీతాలు పెంచలేదన్నారు. గత ఆరు నెలలుగా జీతాలే ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. వెంటనే తమకు ఉద్యోగభద్రత కల్పించి, కనీస వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు అనీల్‌కుమార్, ధనుంజయ రెడ్డి, జెబీవుల్లా, మంజుళ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అంతా అవినీతే.. అభివృద్ధే లేదు..!

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే ధ్వజం
- ఆంధ్రజ్యోతి కథనాల ఆధారంగా సభ్యుల నిలదీత
- తుక్కు, డీజిల్, లేఅవుట్ల అవినీతిపై మండిపాటు
- విచారణకు ఆదేశించిన కందికుంట

కదిరి, జూలై 10: కదిరి మున్సిపాల్టీలో అవినీతే తప్ప.. ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ధ్వజమెత్తారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ నజీమున్నీషా అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎక్స్ అఫిషియో సభ్యుడు కందికుంట హాజరై మాట్లాడారు. మున్సిపాలిటీలో అన్ని వార్డులకూ పార్టీలతో సంబంధం లేకుండా నిధులు కేటాయిస్తామన్నారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఇటీవల ప్రచురించిన తుక్కు దొంగలు, ఫైల్ చైర్‌పర్సన్ ఇంటికే.. తదితర కథనాలను సభ్యులు చూపుతూ అవినీతిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపాలిటీలో తుక్కును దొంగలించింది ఎవరో తేల్చాలని, దీనిపై విజిలెన్స్ కమిటీ వేయాలని సభ్యులు ఎమ్మెల్యేను డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏ అధికారంతో తుక్కును బయటకు తరలించాలని మున్సిపాల్టీ డీఈ విజయ్‌కుమార్‌ను ప్రశ్నించారు. అనుమతి లేకుండా తీసుకెళ్లినవారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రభుత్వ


కౌన్సిల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట


డీజిల్ కుంభకోణంపై ధ్వజమెత్తిన సభ్యులు



ఆంధ్రజ్యోతి కథనాలను చూపుతూ అవినీతిని ప్రశ్నిస్తున్న సభ్యుడు

భూములను ఆక్రమించుకుని, లే అవుట్లు వేసి ఉంటే వాటిని స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. కదిరి మున్సిపాలిటీలో రూ. రెండు కోట్ల డీజిల్ కుంభకోణం జరిగిందని 4వ వార్డు సభ్యుడు కృపాకర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. వార్డుల్లోని సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అధికారులు వాటిని నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని అన్నారు. పలు అంశాలను ఆమోదించాలని ఆజెండాను చైర్‌పర్సన్ నజీమున్నీషా కౌన్సిల్ సభ్యుల ముందు పెట్టారు. అయితే ఆ ఆజెండాలో అన్ని కుంభకోణాలున్నాయని, దీని ఆమోదించరాదని సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో ఆజెండాను వాయిదా వేశారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వీడండి

- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

ధర్మవరం, జూలై 10: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను హెచ్చరించారు. నియోజకవర్గ అభివృద్ధే తన అజెండా అని స్పష్టం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశపు భవనంలో ఆయన బుధవారం నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీ రామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని సమస్యలను గుర్తించడానికే ఈ సమీక్ష నిర్వహిస్తున్నామని, అందుకు సంబంధిత అధికారులు ప్రణాళికలు, నివేదికలు తనకు అందజేయాలని ఆదేశించారు. త్వరలో మళ్లీ శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్, చిత్రంలో పరిటాల శ్రీరామ్

ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులను ఎంత ఖర్చుచేశారు తదితర వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని, అధికారులూ కూడా అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. నియోజకవర్గంలో నేతన్నలు ఎక్కువగా ఉన్నారని, వారిని అభివృద్ధి చేయడానికి కేంద్రం నుంచి అధిక మొత్తంలో నిధులు మంజూరుచేయడానికి కృషిచేస్తానని, అందుకు ప్రణాళికల సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం కేంద్రప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసి సొంత పథకాలకు వాడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, డీఈఓ మీనాక్షి, డీఎంహెచ్‌ఓ మంజులవాణి, విద్యుత్‌శాఖ ఎస్సీ సుధాకర్, వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.


కొత్తపేటలో కొలువు దీరిన పీర్లస్వాములు

కొలువు దీరిన పీర్లస్వాములు

ధర్మవరం, జూలై 10: స్థానిక కొత్తపేటలో పీర్లస్వాములు బుధవారం కొలువు తీరాయి. కాలేసమస్తాన్ కమిటీ ఆధ్వర్యంలో పీర్లస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 14న చిన్నసరిగెత్తు, 15న పెద్ద సరిగెత్తు కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు మహేశ్, మౌళి, షఫీ,షెక్షా పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు పీర్లస్వాములకు చక్కెర చదివింపులు చేయించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

నంబులపూలకుంట, జూలై 10: మండలంలోని గూటిబైలు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం భూసార పరీక్షలపై బుధవారం అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణంలో మట్టిని సేకరించి, పరీక్షల వలన కలిగే లాభాలను పీడీ ఆత్మా మద్దిలేటి, ఏఓ శ్రీనాథ్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రసాద్, శిరీషా, ఆత్మ ఏపీఎం మౌనిక, శాంతమ్మ పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలపై అవగాహన

నల్లమాడ, జూలై 10: మట్టి నమూనా పరీక్షలపై రైతు సేవా కేంద్ర సహాయకులకు, రైతులకు జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకుడు సనావుల్లా బుధవారం అవగాహన కల్పించారు. నల్లమాడలో రైతుల పొలాల నుంచి మట్టి సేకరించే విధానం, పరీక్షల గురించి వివరించారు. మట్టి పరీక్షలు చేయడం వలన భూమిలో ఖనిజాలు ఏఏ శాతంలో ఉన్నాయో తెలుస్తుందని, తద్వారా ఏ పంట సాగుచేయవచ్చు.. ఎంత మోతాదులో ఎరువులు వినియోగించాలో తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుమతి, రైతు సేవా కేంద్రా సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బ్యాంక్ అధికారుల తీరుపై నిరసన

ఓబుళదేవరచెరువు, జూలై 10: ఖాతాదారుల పట్ల బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం స్టేట్‌బ్యాంక్ ఎదుట ఆర్పీపీ నాయకులు ఆందోళన చేశారు. ఆర్పీపీ డివిజన్ కార్యదర్శి మున్నా, నాయకుడు రామచంద్ర మాట్లాడుతూ... స్టేట్ బ్యాంక్ అధికారులు లబ్ధిదారుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, సేవలు సరిగా అందించలేదన్నారు. ఖాతాలు హోల్‌లో పడితే వాటని తొలగించాలంటే నాలుగైదుమార్లు బ్యాంక్ చుట్టు అధికారులను తిప్పుకుంటున్నారని వాపోయారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బ్యాంక్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనార్ధన్, శివమ్మ, అర్జున్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తనకల్లు, జూలై 10: మండలంలోని కొర్తికోట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మంజునాథ్ తల్లి లక్ష్మీదేవమ్మ అనారోగ్యంతో బుధవారం మరణించారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆ గ్రామానికి కెళ్లి.... ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడి, వెంకటరెడ్డి, హనుమంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పల్లె పరామర్శ

బుక్కపట్నం : మండలంలోని గూనిపల్లి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు తలారి జయశంకర్ గుండెపోటుతో మంగళవారం మరణించిన విషయం తెల్సిందే. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సిద్దరామపురానికి వెళ్లి.. బాధిత కుటుం సభ్యులను పరామర్శించారు. టీడీపీ విజయానికి జయశంకర్ చాలా కృషి చేశారని గుర్తు చేసుకున్నారు.

జీఓ నెంబర్ 101ను పునరుద్ధరించాలి

పుట్టపర్తి రూరల్, జూలై 10: వైసీపీ ప్రభుత్వం జీఓ నెంబరు 101 అమలు చేయకుండా తుంగలో తొక్కిందని, ఆ జీఓను వెంటనే పునరుద్ధరించి అమలు చేయాలని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లే ప్రసాద్ కోరారు. బుధవారం ఆయన పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ.. 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీఓను తీసుకురాగా... వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గి దాన్ని అమలు చేయకుండా మరుగున పడేశారని అన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, ట్రెజరర్ శంకరనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బొల్లేప్రసాద్

అధునాతన బేకరీ యూనిట్ ప్రారంభం

పుట్టపర్తి, జూలై 10: సత్యసాయి భక్తుల కోసం అధునాతన నూతన బేకరి యూనిట్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ బుధవారం ప్రారంభించారు. ప్రశాంతి నిలయంలో శ్రీసత్యసాయి సాధనా ట్రస్టు నిర్వహిస్తున్న బేకరి సెంటర్లో పెరుగుతున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని తక్కువ సమయంలో ఎక్కువ బేకరి పదార్థాలను తయారు చేసే యంత్రాలను ఆయన ప్రారంభించారు.


అధునాతన బేకరీని ప్రారంభిస్తున్న రత్నాకర్

బాధ్యతగా విధులు నిర్వహించండి

ఉద్యోగులకు నూతన కలెక్టరు టీఎస్ చేతన్ సూచన

పుట్టపర్తి, జూలై 10: జిల్లాలోని ఉద్యోగులు క్రమశిక్షణ, బాధ్యతగా విధులు నిర్వహించాలని, సమష్టిగా పని చేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని నూతన కలెక్టరు టీఎస్ చేతన్ అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా మూడో కలెక్టరుగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధిపై గురువారం ఓ సమావేశం నిర్వహిస్తామని, దీనికి సంబందించి అధికారులందరూ పూర్తి వివరాలతో హాజరుకావాలని ఆదేశించారు. ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అన్నక్యాంటీన్ల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, సీజనల్ వ్యాధులు, చేనేతరంగం, మధ్యాహ్న భోజనం, ప్రజా పంపిణీలపై సమీక్ష నిర్వహించారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా డెంగీ నివారణపై అవగాహన కల్పించే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో



డెంగీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టరు చేతన్, అధికారులు

జేసీ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్‌కలెక్టరు అపూర్వ భరత్, జడ్పీ సీఈఓ నదియా, డీఆర్‌ఓ కొండయ్య, సీపీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణపై అవగాహన కల్పించండి

కుటుంబ నియంత్రణ, జనాభా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టరు టీఎస్ చేతన్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్లో జనాభా దినోత్సవంపై అవగాహన కల్పించే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. జూలై 11న ప్రపంచ జనాభా దినాన్ని జరుపుకుంటున్నామని, వారోత్సవాల్లో భాగంగా ఈనెల 27 వరకు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు.


పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు నిరసన



ధర్మవరంలో అంగన్‌వాడీల ర్యాలీ

సమస్యలను పరిష్కరించాలని కార్మికుల ర్యాలీ

పుట్టపర్తి రూరల్, జూలై 10 : కోర్కెల దినంలో భాగంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం కార్మికుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక గణేష్ కూడలి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేసు, జిల్లా ఉపాధ్యక్షుడు ఇంతియాజ్ మాట్లాడుతూ.. కార్మిక లేబర్ కోడ్లను రద్దుచేయాలని, కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలను ఇవ్వాలని డిమాండు చేశారు. అంగన్‌వాడీ ఐకేపీ మధ్యాహ్న భోజనం ఫీల్డ్ అసిస్టెంటు స్వచ్ఛ భారత్ వివిధ ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై రాజకీయ ఒత్తిళ్లు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ కన్వీనర్ బాబావలి, రాజురావు, అంగన్‌వాడీ వర్కర్ల హెల్పర్ల యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం : కార్మికులు, అంగన్‌వాడీలు సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, పాల్గొన్నారు.

కదిరిఅర్బన్ : అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులు, సివిల్ సప్లయ్ హమాలీలు స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు, జగన్మోహన్, రామమోహన్, ముస్తాక్ పాల్గొన్నారు.

అలాగే గాండ్లపెంట, నల్లచెరువు, నంబులపూలకుంట, ఓబుళదేవరచెరువు, తనకల్లు, నల్లమాడ, ముదిగుబ్బ తదితర ప్రాంతాల్లో కార్మికులు, అంగన్‌వాడీలు ర్యాలీలు నిర్వహించి.. అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.



కదిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన

తాత్కాలిక డీఆర్ఎంగా విజయకుమార్



గుంతకల్లు, జూలై10: గుంతకల్లు రైల్వే డివిజన్‌కు తాత్కాలిక డీఆర్ఎంగా ఎం విజయకుమార్‌ను నియమిస్తూ రైల్వే బోర్డు ఉత్తర్వులను బుధవారం జారీచేసింది. గతంలో డీఆర్ఎంగా ఉన్న వినీత్ కుమార్ అవినీతి కేసులో సీబీఐకి చిక్కిన కారణంగా ఆయన స్థానంలో దక్షిణమధ్య రైల్వే జోన్‌లో ఇండియన్ రైల్వే సర్వీస్ మెకానికల్ ఇంజనీరుగా (నాన్ ఫంక్షనల్ హయ్యర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్) పనిచేస్తున్న ఎం విజయకుమార్‌కు తాత్కాలికంగా డీఆర్ఎం విధులను అప్పగించారు. రెగ్యులర్ డీఆర్ఎంగా మరొక అధికారి వచ్చేంత వరకూ ఈయన డివిజనల్ రైల్వే మేనేజరుగా కొనసాగుతారు.

ఉచిత ఇసుక అమలుపై హర్షం

కదిరి(అమడగూరు): రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఇసుక విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేయడం హర్షనీయమని టీడీపీ కన్వీనర్ గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు నిర్మించుకునే పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇదో వరమని అన్నారు. కార్యక్రమంలో మలక రాజారెడ్డి, రమణ, రాజారెడ్డి, బూత్ కన్వీనర్లు మూర్తి, క్రిష్టారెడ్డి, తుమ్మిలిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల సంత


ఏటా ముదిగుబ్బ పంచాయతీకి భారీ ఆదాయం
వసతుల కల్పనపై అధికారుల నిర్లక్ష్యం

ముదిగుబ్బ, జూలై 10: స్థానికంగా నిర్వహించే వారపు సంతలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇటు వ్యాపారులు, అటు వినియోగదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముదిగుబ్బ మండలంలోని అన్ని గ్రామాలు, బుక్కపట్నం మండలం, బత్తలపల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలు ముదిగుబ్బలో శుక్రవారం జరిగే వారపు సంతకు వందల సంఖ్యలో వస్తుంటారు. జాతీయ రహదారికి ఆనుకొని వారపు సంత నిర్వహిస్తుండడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కూరగాయల సంతలో వసూలు చేసే సుంకం ద్వారా పంచాయతీకి ఏటా రూ. లక్షల్లో ఆదాయం వస్తోంది. చుట్టుపక్కల మండలాల్లో రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలను ఇక్కడ విక్రయిస్తారు. కూరగాయలతో పాటు వంట సామగ్రి, ఆకుకూరలు, పండ్లు, ఇతర వస్తువులను సంతలో విక్రయిస్తుంటారు. అయినా ఈ సంతలో ఎలాంటి వసతులు కల్పించలేదని, ఎర్రటి ఎండలో రహదారిపైనే వ్యాపారులు వారపు సంత నిర్వహిస్తున్నారని, వర్షం పడితే సంతను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడుతోందని, సుంకం మాత్రం ముక్కు


అసౌకర్యాల నడుమ నిర్వహిస్తున్న వారపు సంత

పిండి మరీ వసూలు చేస్తున్నారని నిర్వాహకులు వాపోతున్నారు. సొసైటీ ఆవరణంలో మురుగు కాలువ పైనే కూరగాయలు విక్రయిస్తుండడంతో వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గొర్రెల సంతలో కానీ, కూరగాయల సంతలో కానీ కనీసం తాగునీరు, నీడ సౌకర్యాలు లేవని, ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం లక్షల ఆదాయం ఉన్న ఈ వారపు సంత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వారపు సంతపై ప్రత్యేక దృష్టి పెట్టి సౌకర్యాలు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


అధికారులు పట్టించుకోవడం లేదు



వారపు సంత సమస్యలపై గతంలో సంబంధిత అధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు అందించాము. ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదు. వారపు సంతలో సమస్యలు తిష్ట వేశాయి. వాటిని పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి, ముదిగుబ్బ

ట్రాఫిక్ జాం అవుతోంది



వారపు సంతతో తరచూ ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటు వ్యాపారులు.. ఇటు కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారు. అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు వారపు సంత రోజు సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

కొండేటి చంద్రశేఖర్, ముదిగుబ్బ వాసి

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేయండి

మంత్రి సవితకు ఎమ్మెల్యే సింధూరరెడ్డి వినతి

పుట్టపర్తి, జూలై 10: అత్యంత వెనుకబడిన అనంతపురం, సత్యసాయి జిల్లాల అభివృద్ధికి సహకరించాలని బీసీ సంక్షేమశాఖా మంత్రి సవితను ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోరారు. వీరి ఆహ్వానం మేరకు బుధవారం మంత్రి అనంతపురంలోని పీవీకేకే కళాశాలకు విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రిని వారు సన్మానించారు. పుట్టపర్తిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల అధినేత పల్లెక్రిష్ణకిశోర్, టీడీపీ నాయకులు ఉన్నారు.


మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

నూతన కలెక్టర్‌కూ వినతి

పుట్టపర్తి : ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన పుట్టపర్తిని మరింత అభివృద్ధి చేయడానికి సహాయసహకారాలు అందించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి నూతన కలెక్టరు టీఎస్ చేతన్‌ను కోరారు. బుధవారం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పుట్టపర్తిని పర్యాటకంగా అన్ని హంగులతో అభివృద్ధి చేయడానికి సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ రత్నప్పచౌదరి, మునిసిపల్ మాజీ చైర్మన్ చలపతి, నాయకులు రామాంజినేయులు, కడియాల సుధాకర్ నాయుడు, మహ్మద్ రఫీ ఉన్నారు.

వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే సిద్ధారెడ్డి సస్పెన్షన్



కదిరి, జూలై 10 : కదిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డిని వైసీపీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ కేంద్ర కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. అతను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో అతనిపై క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ అధ్యక్షుడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పింది.

సచివాలయానికి సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల అందజేత


సచివాలయానికి సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలను అందజేస్తున్న నాయకులు

కొత్తచెరువు, జూలై 10: మండలంలోని కొడపగానిపల్లి గ్రామ సచివాలయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి చిత్రపటాలను కార్యదర్శి గంగాధర్‌రెడ్డికి టీడీపీ, జనసేన నాయకులు బుధవారం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వ కార్యాలయాలలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలు ఉంచాలని ప్రభుత్వం జీఓ జారీ చేసిందని, ఈ క్రమంలో ఈ చిత్రపటాలను అందజేశామని వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు కొడపగానిపల్లి శివ, రవికుమార్, సూర్యనారాయణ, ఈడిగ ఓబుళపతి, చంద్రమోహన్, రాజాగౌడ్, నాగేంద్ర, సుబ్బు, ఆటోశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ


విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు

బత్తలపల్లి, జూలై 10: మండలంలోని విశ్వనాథ్‌పురం ప్రభుత్వ పాఠశాలలోని 21 విద్యార్థులకు యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 30 విలువ చేసే పుస్తకాలు, పెన్నులను, పాఠశాలకు టీవీని బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ ఫౌండేషన్ సభ్యులు జయరాం, గంగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఓంటేరు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో...

పుట్టపర్తి రూరల్: మండలంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన బ్యాగులు, దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు, అధ్యాపకుడు అజీం, పాఠశాల సిబ్బంది, పెడపల్లి మాజీ సర్పంచు శ్రీరాంనాయక్, టీడీపీ నాయకులు వనం కృష్టారెడ్డి, బొమ్మయ్య, బాలాజీ, చిన్నకుళ్ళాయప్ప, జిక్రియ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో తొమ్మిది మంది ఎంపిక


జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

ధర్మవరం, జూలై 10 : స్థానిక శ్రీనివాస పీజీ, డిగ్రీ కళాశాలలో టీవీఎస్ అండ్ టీఎస్ ఆధ్వర్యంలో ఐసీఐసీఐ బ్యాంక్ పరిధిలో బుధవారం మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఇందులో 64 మంది డిగ్రీ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా... తొమ్మిది మంది ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ముసల్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె వెంకట క్రిష్ణ కిశోర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐసీఐసీఐ సీనియర్ హెచ్‌ఆర్ గోపాల్‌క్రిష్ణ, బాబా, కళాశాల ప్రిన్సిపల్ ముసల్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పుష్ప వాహన రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ తనిఖీ

బత్తలపల్లి, జూలై 10: మండలంలోని నల్లబోయనపల్లి వద్ద ఇసుక స్టాక్ పాయింట్‌ను మైన్స్ ఏడీ రాంమోహనరావు బుధవారం తనిఖీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇసుక టన్ను రూ.277కే అందజేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యం

● వైద్య కళాశాలతో సమానంగా సేవలు ● ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక దృష్టి: సూపరింటెండెంట్ రోహిల్

హిందూపురం అర్బన్, జూలై 10: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ తరహాలో వైద్యసేవలు అందిస్తామని, అందుకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పూర్తి సహకారం అందిస్తున్నారని సూపరింటెండెంట్ రోహిల్, ఆర్ఎంఓ. డేవిడ్‌రాజ్, ఎమ్మెల్యే రాజకీయ కార్యదర్శి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసిందన్నారు. ప్రతి పేదవాడికి కార్పొరేట్ తరహాలో వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా చూడాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమన్నారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అందని వైద్యం కూడా ఇక్కడ అందజేస్తామన్నారు. అన్ని రకాల రోగాలకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందిస్తారన్నారు. ఆరోగ్యశ్రీ ఉపయోగించుకుంటే దాదాపుగా రూ. 30 నుంచి రూ. 40 వేల వరకు ఖర్చులు మిగులుతాయన్నారు. అదే విధంగా వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. రోగుల పట్ల వైద్యులు సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. తప్పని పరిస్థితుల్లో రెఫర్‌లు ప్రభుత్వ ఆసుపత్రులకు మాత్రమే చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో వైద్య సేవలు నిర్వీర్యం కావడంతో గ్రహించిన బాలయ్య ఆరోగ్య సురక్ష వాహనం ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. త్వరలో మరింత నాణ్యమైన సేవలు అందించడానికి సీటీ స్కానింగ్ యంత్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంసీహెచ్‌లో 80 దాకా వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అదే విధంగా ఐసీయూ సౌకర్యం కూడా ఉందన్నారు. ఆస్పత్రి సేవలకు ఎవరైనా డబ్బులు అడుగుతున్నట్లు ఆధారాలతో సమాచారం అందిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు డీఈ రమేష్‌కుమార్, సీనియర్ నాయకుడు జేఈ వెంకటస్వామి, నర్సులు ఓబులమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

రేపు వారపు సంత వేలం

గోరంట్ల, జూలై 10: మండలకేంద్రంలోని వారపు సంత వేలం శుక్రవారం నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహణాధికారి బాబురావు బుధవారం ఓప్రకటనలో తెలిపారు. కూరగాయాల సంతతోపాటు, గోరంట్ల బస్టాండ్, స్టాండ్ ఫీజు, జీఆర్‌పై గదులు, సంత మార్కెట్‌లోని గదులకు అదే రోజు మధ్యాహ్నం 12గంటలకు పంచాయతీ కార్యాలయంలో వేలం పాటలు నిర్వహిస్తారన్నారు. సంత వేలం కాంట్రాక్టు మార్చి నెలాఖరుతో ముగిసింది. పంచాయతీ వేలం నిర్వహించాలని తలపెట్టినా, ఎన్నికల కారణంగా రెండుమార్లు రద్దు చేయడంతో, పంచాయతీ సిబ్బంది ద్వారా వారంపు సంత వసూలు నిర్వహిస్తోందన్నారు. వేలంలో పాల్గొనేవారు నిర్ణీత డిపాజిట్‌తోపాటు ఆస్తి మదింపు సర్టిఫికెట్ లేదా బ్యాంకర్‌చెక్కు ద్వారా పంచాయతీ కార్యాలయంలో ముందుగానే నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అంతర్జాతీయ పోటీలకు విద్యార్థుల ఎంపిక

పెనుకొండ, జూలై 10 : ఈనెల 21న తెలంగాణ రాష్ట్రం మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ జరగనుంది. పోటీలకు శ్రీ సత్యసాయిజిల్లా పెనుకొండ బ్రిలియన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. జూనియర్ కేటగిరీలో యక్షిత్, సలోని, హర్షిని, కటాస్ ఎంపికైనట్లు కరాటే మాస్టర్ మహేంద్ర తెలిపారు. అంతర్జాతీయ స్థాయి పోటీలలో మొదటిసారిగా పాల్గొంటున్న విద్యార్థులను కరస్పాండెంట్ నాగమణి, గ్రాండ్ మాస్టర్ రామచంద్ర అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో మాస్టర్

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

చిలమత్తూరు, జూలై 10: సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఈఓఆర్డీ ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శి రామలానాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో పలు వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో పారిశుధ్యంపై ఇప్పటికే ఆయా సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చేయడం, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామన్నారు. మురుగునీటి నిల్వలపై బ్లీచింగ్ పిచికారి చేస్తున్నామన్నారు. పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన తీసుకువస్తున్నామని, ఎక్కడా కలుషిత నీటిని తాగకుండా కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించామన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని నీటి ట్యాంకు చుట్టూ, చెత్త కుప్పలను తొలగించి బ్లీచింగ్ చేశారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు కదలం


తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళనలో బాధితులు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 10: మండల కేంద్రంలోని సర్వేనంబరు 700-1బీ చింతతోపులో పేదల గుడిసెలను అధికారులు తొలగించిన సంగతి తెలిసిందే. దీనికి నిరసనగా రెండో రోజులుగా సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడుతూ తొలగించిన ఇళ్లవద్దే తమకు ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వంటావార్పు కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అయితే తమకు ఇళ్ల పట్టాలు ఇచ్చేంతవరకు కార్యాలయం వదిలివెళ్లమని భీష్మించారు. అన్నమైనా పెట్టండి జైలుకైనా పంపండి అంటూ నినాదాలు చేశారు. సీపీఐ నాయకులు బాలస్వామి, చాంద్‌బాష, గాయిత్రి, కమల్‌బాష, నౌషాద్, జిలాన్, గంగాధర్, జియా, దాదు, శివ, శీన, షబ్బీర్, అంజినమ్మ, నూర్జహాన్, భారతమ్మ పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

అగళి, జూలై 10 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న నరేగా పనులను సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. రామనపల్లి గ్రామంలో బుధవారం నరేగా పనులు ఉపాధి సిబ్బందితో కలిసి ప్రారంభించారు. సర్పంచ్ కిష్టప్ప, టెక్నికల్ అసిస్టెంట్ గిరీష్, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


రామనపల్లిలో నరేగ పనులు పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పాఠశాలలో బోధన వస్తువుల పంపిణీ

మడకశిర రూరల్, జూలై 10: మండలంలోని బుళ్ళసముద్రం ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న 11 పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం పలక, బలపాలు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్ మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువు కోసం దాతలు రూ.30 వేలు సహాయం అందించారని వాటితో 11 పాఠశాలలోని విద్యార్థులకు అవసరమైన వస్తువులు అందజేశామన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలు సాధించాలని వారు సూచించారు. అనంతరం మాజీ సర్పంచ్ జైపాల్, ఉపాధ్యాయులు, జనసేన నాయకులు ప్రధానోపాధ్యాయుడిని సత్కరించారు.


పాఠశాలకు పలకలు అందజేస్తున్న హెచ్ఎం

వైసీపీ నిర్లక్ష్యంతోనే విద్యుత్ సమస్యలు : ఎమ్మెల్యే

మడకశిర టౌన్, జూలై 10: ఐదేళ్ల వైసీపీ నేతల నిర్లక్ష్యంతోనే నియోజకవర్గంలో రైతులకు విద్యుత్ సమస్యలు అధికమయ్యాయని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు పేర్కొన్నారు. బుధవారం అనంతపురంలో విద్యుత్తు శాఖ ఎస్ఈ ఎం.సురేంద్రను కలసిన ఆయన మడకశిర నియోజకవర్గంలో రైతులు పడుతున్న ఇబ్బందులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే తిప్పేస్వామి రైతుల సమస్యలు పట్టించుకొన్న పాపాన పోలేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కావాలన్నా, వ్యవసాయ బోరులకు విద్యుత్తు సర్వీసులు కావాలన్నా పెడచెవిన పెట్టారన్నారు. బోర్లు వేసుకొని సంవత్సరాలు గడుస్తున్నా ట్రాన్స్‌ఫార్మర్‌లు అమర్చి విద్యుత్ కనెక్షన్ ఇవ్వక పోవడంతోనే రైతులకు సమస్యలు తప్పడం లేదన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వ్యవసాయానికి 1000 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమన్నారు. ఇప్పటికే 412 మంది రైతులు బోర్లు వేసి సర్వీసుల కోసం ఎదురు చూస్తున్నారని వారికి వెంటనే విద్యుత్తు సర్వీసును అందించి ఆదుకోవాలని కోరారు.


ఎస్ఈకి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

నగర పంచాయతీని సుందరంగా మార్చడమే లక్ష్యం

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి


డివైడర్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు గుండుమల

మడకశిర టౌన్, జూలై 10: మడకశిర నగర పంచాయతీని సుందరంగా తీర్చిద్దిడం లక్ష్యమని, రెండు కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడ్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. బుధవారం మడకశిర నగర పంచాయితీ పరిధిలో పలు పనులను ఆయన పరిశీలించారు. డివైడర్ల మధ్యలో మట్టిని తొలగించి మొక్కలను నాటడం, సుందరంగా పెయింటింగ్, విద్యుత్తు పోల్స్ ఏర్పాటు చేసి ఎల్ఈడీ లైటింగ్, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్ నరసింహరాజు, పట్టణ అధ్యక్షుడు మనోహర్‌లతో పాటు నగర పంచాయతీ అధికారులకు సూచించారు. మడకశిర చరిత్ర ప్రతిబింబించేలా చిత్రాలను గీయాలన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం మీడియా కోఆర్డినేటర్ రవి, నగర పంచాయితీ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించండి

● కోర్కెల దినోత్సవంలో అంగన్‌వాడీలు, కార్మికులు ● పలు ప్రాంతాల్లో నిరసనలు, ర్యాలీలు


హిందూపురంలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ, అంగనవాడీ కార్యకర్తలు

హిందూపురం అర్బన్, జూలై 10: అంగన్‌వాడీలు, కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చాలని డిమాండ్ చేస్తూ వారు ర్యాలీ చేపట్టారు. బుధవారం అంగన్‌వాడీల కోర్కెల దినోత్సం సందర్భంగా సీఐటీయూతో కలిసి స్థానిక ఇందిరా పార్కు వద్ద నుంచి అంబేడ్కర్, ఎన్టీఆర్ సర్కిళ్ల మీదుగా ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లు తీసుకువచ్చిందన్నారు. ఉన్న కార్మిక చట్టాలనే సక్రమంగా అమలు చేయడం లేదని ఇక లేబర్ చట్టాలు అమలు చేస్తే కార్మికులు బానిసలుగా మారాల్సి వస్తుందన్నారు. సుప్రీం కోర్టు తెలిపిన మేరకు అంగన్ వాడీలకు రూ. 16 వేలు వేతనం ఇవ్వాలన్నారు. అంబేద్కర్ సర్కిల్‌లో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు, సీఐటీయూ నాయకుడు రాము, అంగన్‌వాడీ నాయకులు లావణ్య, శిరీష, శైలజ, వరలక్ష్మీ, కెవి పిఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి, యునిసిపల్ యూనియన్ నాయకులు జగదీష్, మల్లికార్జున, ప్రీకాట్ మిల్లు నాయకులు సదాశివరెడ్డి, ఆటో యూనియన్ నాయకులు రామకృష్ణ, వందలాది మంది అంగన్‌వాడీలు, కార్మికులు హాజరయ్యారు.

పెనుకొండ : కోర్కెల దినోత్సవం సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పట్టణంలోర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు రమేష్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వాలు అంగన్‌వాడీ, ఆశ, ఐకేపీ, మధ్యాహ్న భోజన, ఫీల్డ్, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులపై వేధింపులు మానుకోవాలన్నారు. సీఐటీయూ నాయకులు బాబావలి, రాజారావు, అంగనవాడీ నాయకులు జయమ్మ, బావమ్మ, సావిత్రి, లక్ష్మీదేవి, పద్మ, సరస్వతి, శాంతిబాయి, పార్వతి, అనూష, మీనాకుమారి, సుజాత, సుధామణి, అరుణ, అనిత, కవిత, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

10ఎస్ఎంపి3 : తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న అంగనవాడీలు

హిందూపురం(సోమందేపల్లి) : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ అంజనాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెద్దన్న, రాజగోపాల్, లక్ష్మీనారాయణ, అంగనవాడీలు, శ్రీదేవి, నూర్జహాన్, పల్లవి, శాంతమ్మ, సరిత పాల్గొన్నారు.

చిలమత్తూరు: కార్మికుల న్యాయపరమైన కోర్కెలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు ప్రవీణ్, వెంకటేష్, లక్ష్మినారాయణ, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు శోభారాణి తదితరులు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

అగళి : మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు జాతీయ కోరికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మానవహారంగా ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తూ నినాదాలు చేశారు. కార్యకర్తలు ఆయాలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లేపాక్షి : కోర్కెల దినోత్సవం సందర్భంగా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. న్యాయమైన పలు డిమాండ్లను నెరవేర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

తాత్కాలిక డీఆర్ఎంగా విజయ కుమార్



గుంతకల్లు, జూలై10: గుంతకల్లు రైల్వే డివిజన్‌కు తాత్కాలిక డీఆర్ఎంగా ఎం విజయకుమార్‌ను నియమిస్తూ రైల్వే బోర్డు ఉత్తర్వులను బుధవారం జారీచేసింది. గతంలో డీఆర్ఎంగా ఉన్న వినీత్ కుమార్ అవినీతి కేసులో సీబీఐకి చిక్కిన కారణంగా ఆయన స్థానంలో దక్షిణమధ్య రైల్వే జోన్‌లో ఇండియన్ రైల్వే సర్వీస్ మెకానికల్ ఇంజనీరుగా (నాన్ ఫంక్షనల్ హయ్యర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్) పనిచేస్తున్న ఎం విజయకుమార్‌కు తాత్కాలికంగా డీఆర్ఎం విధులను అప్పగించారు. రెగ్యులర్ డీఆర్ఎంగా మరొక అధికారి వచ్చేంత వరకూ ఈయన డివిజనల్ రైల్వే మేనేజరుగా కొనసాగుతారు.

కొలువుదీరిన కుళ్లాయిస్వామి


కొలువుదీరిన కుళ్లాయిస్వామి పీర్లు

నార్పల జూలై 10: అనంతపురం జిల్లాలో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామి పీర్లు మకానంలో బుధవారం కొలువుదీరాయి. తెల్లవారుజామున కుళ్లాయిస్వామి పీర్లను బంగారు ఆభరణాలు, పలు రకాల పూలు, వెండి గొడుగులతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు కుళ్లాయిస్వామిని దర్శించుకుని చక్కెర చదివించారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతాం : ఏఈ

అగళి, జూలై 10 : మండలంలోని ఇరిగేపల్లి సువర్ణముఖి నది నుంచి చెరువు వరకు కట్టకాలువను ఏఈ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతామన్నారు. అదేవిధంగా సువర్ణముఖి నది ద్వారా అక్కడక్కడ కట్టకాలువ కూడా తెగిపోయిందని, వాటిని మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేపల్లి చెరువు కూడా నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు. రైతులకు నీరందించడమే ధ్యేయమన్నారు. ఏఈ వెంట మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఆయకట్టు ప్రెసిడెంట్ కర్రియన్న, తదితరులు ఉన్నారు.

ప్రేమ పెళ్లికి ఒప్పుకోలేదని యువకుడి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన హరికృష్ణ

పెనుకొండ రూరల్, జూలై 10 : ప్రేమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదని మనస్థాపానికి గురై బుధవారం యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రొద్దం ఎస్ఐ వలీబాష తెలిపిన వివరాల మేరకు తురకలాపట్నం గ్రామానికి చెందిన జయమ్మ, సుబ్బరాయుడు దంపతుల కుమారుడు హరికృష్ణ(27) పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. హరికృష్ణ ఓ యువతిని ప్రేమించాడు. సంవత్సరం నుంచి అతడికి ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. అయితే తను ఓ అమ్మాయిని ఇష్టపడ్డానని, ఇష్టం లేని పెళ్లి చేయాలని చూస్తే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించేవాడు. మంగళవారం రాత్రి హరికృష్ణ బట్టలు మార్చుకుంటుండగా ఎదపై అమ్మాయి పచ్చబొట్టు వేసుకున్నట్లు గమనించారు. అమ్మాయి ఎవరని కుటుంబ సభ్యులు ప్రశ్నించగా ఎవరైతే మీకేం నేను ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుంటానని వాదించాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి తలుపులు తెరవడానికి ప్రయత్నించినా రాకపోవడంతో కిటికీలోంచి చూడగా హరికృష్ణ ఉరికి వేలాడుతున్నట్లు గమనించారు. కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వలీబాష సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో వీఆర్ఓ మృతి

హిందూపురం(పరిగి), జూలై 10 : పరిగి మండలం శ్రీరంగరాజులపల్లి పంచాయతీలో వీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ(56) బుధవారం ఉదయం 11.30సమయంలో గుండెపోటుతో కన్నుమూశారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు రామకృష్ణ మంగళవారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే బెంగళూరు విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరిగి రెవెన్యూశాఖ అధికారులు డీటీ లక్ష్మీనరసింహులు, ఆర్ఐ మురళీధర్, రెవెన్యూ సిబ్బంది మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజలు మంచి చేయాలని తపనతో ఉన్న రామకృష్ణ మృతి చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.


రామక్రష్ణ (ఫైల్)

గంజాయి స్వాధీనం

పావగడ, జూలై 10: పట్టణంలోని బాలాజీ లేఅవుట్‌లో గంజాయి అమ్ముతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ రామచంద్రప్ప తెలిపిన వివరాల మేరకు రొప్పం గ్రామానికి చెందిన కుమార్, రైన్‌గేజ్‌కు చెందిన గౌస్‌ముద్దీన్ ఆటోలో గంజాయి అమ్ముతుండగా పావగడ పోలీసులు మెరుపుదాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి రూ.800గ్రాముల గంజాయి, ఇతర మత్తుపదార్థాలు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పాల్గొన్న క్రైం సిబ్బంది సంతోష్, భరత్, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులను డీఎస్పీ అభినందించారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి మధుగిరి జైలుకు పంపారు. అయితే గంజాయి తాగడానికి, అమ్మడానికి అలవాటుపడ్డ మరో ఎనిమిది మందిని పోలీసులు వదిలిపెట్టినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయపడిన శివశంకర్‌నాయక్

గోరంట్ల, జూలై 10: మండలంలోని హిందూపురం ప్రధాన రహదారిలో గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ద్విచక్రవాహనం, ఆటోను ఢీకొని శివశంకర్‌నాయక్ అనే యువకుడు బుధవారం తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని పొప్పనపల్లి తండాకు చెందిన చాప్లానాయక్ కుమారుడు శివశంకర్‌నాయక్ ద్విచక్రవాహనంపై గోరంట్లకు వచ్చి, పని ముగించుకుని స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా పెట్రోల్ బంక్ వద్ద ముందు వెళ్తున్న ఆటోను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఆటోను ఢీకొని ప్రమాదం జరిగింది. అతని కుడి మోకాలు వద్ద ఎముక పూర్తిగా బయటకు రావడంతో, తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉండగా, 108 ద్వారా గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స అనంతరం హిందూపురం తరలించగా, అక్కడనుంచి బెంగుళూరు తరలిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఫళారంలో పలువురికి వాంతులు, విరేచనాలు

గుడిబండ, జూలై 10 : మండలంలోని ఫళారం గ్రామంలో పలువురు వాంతులు, విరేచనాలకు గురయ్యారు. బుధవారం పలువురికి వాంతులు విరేచనాలు కావడంతో గుడిబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అనంతరం మడకశిర, హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. గ్రామంలో అపరిశుభ్రత నెలకొనడంతో డయేరియా లక్షణాలు అధికమవుతున్నాయి. అధికారులు గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరి, ఈఓఆర్డీ నాగరాజునాయక్, సర్పంచ్, సతీష్ మాట్లాడుతూ గ్రామంలో చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయించి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

హిందూపురం(పరిగి), జూలై 10 : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. పరిగి మండల కేంద్రంలో బుధవారం ఉదయం 6గంటల సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఏఎస్ఐ హిదయతుల్లా తెలిపారు. కొందరు స్థానిక నాయకులు ఇష్టమొచ్చినట్లు రాత్రిపూట సుమారు 30కి.మి. మేరలో ఉన్న కర్ణాటక సరిహద్దులోకి ఇసుకను తరలిస్తున్నారు. ఈ అక్రమ రవాణాను అడ్డుకున్న సంబంధిత అధికారులపై ట్రాక్టర్ యజమానులు తిరగబడినట్లు తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సత్యనారాయణకు ఆదేశాలతో ఏఎస్ఐ హిదయతుల్లా దాడులు చేసి ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదుచేసినట్లు వారు తెలిపారు.


సీజ్ చేసిన ట్రాక్టర్లు

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

హిందూపురం(సోమందేపల్లి), జూలై 10 : మండలంలోని జూలకుంట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త శ్రీమారుతి(40) బుధవారం ఉదయం మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న మంత్రి సవిత భర్త వెంకటేశ్వర్లు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

మొహరం వేడుకలకు అనుమతి తప్పనిసరి : ఎస్ఐ

లేపాక్షి, జూలై 10 : మొహరం వేడుకలు జరుపుకునే గ్రామాల్లో నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ గోపీ ఒక ప్రకటనలో సూచించారు. ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడినా, హింసాత్మక చర్యలకు పాల్పడినా, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీర్లచావిడి వద్ద అల్లర్లు జరిగితే కమిటీ సభ్యులదే బాధ్యత అన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనే దమ్ము బీజేపీకి లేదు: మంత్రి

పావగడ, జూలై 10 : ప్రజల ఆశీస్సులతో కర్ణాటకలో అధికారంలో చేపట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే దమ్ము, ధైర్యం బీజేపీకి లేదని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే అభిప్రాయపడ్డారు. బుధవారం పావగడ తాలూకాలోని కారనాగనహట్టి, కెంచమరనహళ్లి గ్రామాల్లో తుంగభద్ర తాగునీటి తరలింపుపై పర్యవేక్షణ సందర్భంగా ఆయన ప్రజలతో ఏకమై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి పావగడకు తుంగభద్ర నీరు రానుందన్నారు. రెండు నెలల్లో ప్రతి ఇంటికి జలజీవన్ మిషన్‌ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. 2013లో రూ.2350కోట్ల నిధులతో 250కి.మి. విజయనగరం నుంచి తుంగభద్ర తాగునీటిని తరలించేందుకు కృషిచేసిన సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు రుణపడి ఉంటామన్నారు.


మంత్రి ఖర్గేకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే నాని

1-19 సర్క్యులర్ అమలు చేయాలని వినతి

హిందూపురం అర్బన్, జూలై 10: 1-19 సర్క్యులర్ అమలు చేసి ఆర్టీసీ కార్మికులు ప్రశాంతంగా ఉద్యోగాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఎన్ఎంయూ నాయకులు బుధవారం అసిస్టెంట్ మేనేజర్ హంపన్నకు వినతి అందించారు. అప్పటి ఆర్టీసి ఎండీగా పనిచేసి ద్వారక తిరుమలారావు ఆర్టీసీ కార్మికుల సంక్షేమాని దృష్టిలో పెట్టుకొని 1-19 సర్క్యులర్ తీసుకొచ్చారన్నారు. అయితే ఆ సర్క్యులర్ రద్దు అయినట్లు కొంత మంది డిపో మేనజర్లు కార్మికుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తూ సస్పెండ్, ఉద్యోగం నుంచి తీసివేసేలా వ్యవహరించడం దారుణమన్నారు. వేల కిలోమీటర్లు బస్సులు నడిపే డ్రైవర్‌లు, వారితో పాటు, కండక్టర్లు కార్మికులు శ్రమదానం చేసి పని ఏస్తుంటారన్నారు. విధి నిర్వహణలో తెలియకుండా జరిగిన తప్పులను దృష్టిలో ఉంచుకోని ఉద్యోగం నుంచి తీసివేస్తే వారి కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. ఇటీవల 8 మందికి హిందూపురం డిపోలో బాధ్యులను చేసి వేధించారని విమర్శించారు. సర్క్యులర్ రద్దు అయినట్లు ఆదేశాలు లేనప్పటికి నియంతలా వ్యవహరిస్తూ కార్మికులను హింసించడం తగదన్నారు. ఎన్ఎంయూ రీజినల్, డిపో నాయకుడు రాజారెడ్డి, వలీసాబ్, విజయలక్ష్మీ, రంగనాథ్, బాష తదితరులు ఉన్నారు.


అసిస్టెంట్ మేనేజర్‌కు వినతి ఇస్తున్న ఎన్ఎంయూ నాయకులు